ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 31 జనవరి, 2026 | పేజీలు :08

## జాతరను సందర్శించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోయల్‌వాడ శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతరను పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) జె.అరుణశ్రీ శుక్రవారం సందర్శించారు. అమ్మవార్లను దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించారు. నది ఒడ్డున ఉన్న శివాలయంలో అభిషేకాది పూజలు చేపట్టారు. జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. జాతరను విజయవంతంగా పూర్తి చేయడం పట్ల జాతర కమిటీ ఛైర్మన్ గీట్ల శంకర్‌రెడ్డి, ఈ.వో. రాజ్‌కుమార్, అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్‌పటేల్, ఇతర అధికారులు, జాతర కమిటీ సభ్యులను ఆమె అభినందించారు.

# సమ్మక్క సారలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

### జనసంద్రంగా మారిన కేశవపట్నం

**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర శుక్రవారం భక్తజనంతో పొటెత్తింది.భారీ సంఖ్యలో భక్తులు హాజరై వనదేవతలను దర్శించుకున్నారు.కొలిచిన వారి ఇంట్లో కొంగు బంగారమైన సమ్మక్క సారలమ్మ వనదేవతలకు భక్తులు టెంకాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు. మహిళా భక్తులు పూనకాలతో గద్దెలను చేరుకొని, అమ్మవార్లకు ఎదురుకోలు ఇచ్చిభక్తిశ్రద్ధలతో మోక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీర్చివెన్నంటే కుటుంబాన్ని కాపాడే వన దేవతలకు పిల్లలు పెద్దలు వృద్దులు ఎత్తు బంగారం తలనీలాలు, కానుకల రూపంలో మొక్కులు సమర్పించారు. దేవాదాయ ధర్మాదాయ ఆధీనంలోని ఈ జాతరకు ఈవో మారుతీరావు, చైర్మెన్ గుర్రం స్వామి, జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వైద్యం, మంచినీరు, పరిశుభ్రత, పోలీస్ భద్రత తాత్కాలిక మరుగుదొడ్లు, సులువైన దర్శనానికి క్యూలైన్లు అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఏర్పాట్లు చేశారు. సమ్మక్క సారలమ్మ జాతర సజావుగా సాగిందని భక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.





## గూడెం గుట్టలపై 'మట్టి' మాఫియా పంజా!

### అక్రమార్కులకు కాసుల వర్షం.. పర్యావరణానికి భారీ విఘాతం

### ఖజానాకు కోట్లలో గండి.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

**ప్రజాపక్షం/దండేపల్లి/మంచిర్యాల:**దండేపల్లి మండలం గూడెం గ్రామ శివార్లలో భూమాత గర్భం ఛిద్రమవుతోంది. పవిత్ర పుణ్యక్షేత్రమైన సత్యనారాయణ స్వామి ఆలయ సమీపంలోని గుట్టలు అక్రమార్కుల ధనదాహానికి కరిగిపోతున్నాయి. కొందరు స్వార్థపరులు యంత్రాలతో కొండలను పిండి చేస్తూ ప్రకృతి సంపదను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమో లేక అండదండలో తెలియదు కానీ ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కళ్ళ ముందే కొండలు కరిగిపోతున్నా, అక్రమార్కుల జేబులు నిండుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు వాపోతున్నారు. **చీకటి మాటున చిగురిస్తున్న అక్రమ దందా :**మైనింగ్ చట్టాలను తుంగలో తొక్కి రాత్రికి రాత్రే జెసిబిలు, ప్రోక్లయినర్లతో భూమాత గర్భాన్ని చీల్చేస్తున్నారు. పగలు నిశ్శబ్దంగా ఉంటూ రాత్రి 10 గంటలు దాటిన తర్వాత వందలాది టిప్పర్లతో మొరాన్ని తరలిస్తూ అక్రమార్కులు కోట్లు గడిస్తున్నారు. నిర్ణీత పరిమితులకు మించి లోతుగా తవ్వకాలు జరపడం వల్ల అటవీ సంపద నాశనమవ్వడమే కాకుండా భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోతున్నాయి. కొండల పైన, చుట్టుపక్కల ఉన్న పచ్చని చెట్లను యంత్రాలతో నేల మట్టం చేస్తుండటంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. **మొరం ముసుగులో రాళ్ల వ్యాపారం**

అక్రమార్కుల వ్యూహం ఇక్కడ రెట్టింపు లాభాలను తెచ్చిపెడుతోంది. గుట్టలను తవ్వడం వల్ల లభించే మొరాన్ని విక్రయించడమే కాకుండా అందులో దొరికే 'బేస్‌మెంట్' రాళ్లను సైతం విడివిడిగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకవైపు ప్రకృతిని ధ్వంసం చేస్తూనే మరోవైపు ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్లాది రూపాయల సీనరేజ్ రుసుమును ఎగ్గొడుతూ ఖజానాను కొల్లగొడుతున్నారు. అధికారుల కళ్ల ముందే ఇంత జరుగుతున్నా వారు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదంతా వారికి తెలిసే జరుగుతోందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. **దుమ్ము రేగుతోంది.. రోగాలొస్తు-న్నాయి:** అక్రమ రవాణా చేసే టిప్పర్లు గ్రామ వీధుల గుండా వేగంగా ప్రయాణిస్తుండటంతో గాలిలో భారీగా ధూళి రేగుతోంది. ఫలితంగా స్థానిక గ్రామస్థులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలపై దుమ్ము పేరుకుపోయి దిగుబడి తగ్గుతోందని రైతులు వాపోతున్నారు. తవ్వకాల వల్ల ఏర్పడిన భారీ గోతులు ప్రమాదకరంగా మారాయని ఆందోళన చెందుతున్నారు. ఎంతో విలువైన గుట్టలు మాయం కాకముందే అధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



**ప్రజాపక్షం/ఖానాపూర్:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని నిర్మల్ డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తను మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అ భ్యర్థులను గెలిపించాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన గత రెండేళ్ల కాలంలో అనేక అభివృద్ధి పనులు చేశామని, అదే విధంగా ఖానాపూర్ పట్టణంలో గత కొన్ని రోజుల క్రితం 15 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించామని, పట్టణంలో గత కొంతకాలంలా రోడ్డు వైండింగ్ పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేయడంతో వాటిని పున ప్రారంభించడం జరిగిందని, త్వరలోనే రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేస్తామని, ఖానాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికై కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పాటు పడుతుందని, అధికారంలో లేని పార్టీని మాటలు విని ప్రజలు అపోహ చెందకుండా అధికారంలో ఉన్న పార్టీని గెలిపించి మున్సిపాలిటీ మరింత అభివృద్ధి పరచాల్సిన భాధ్యత ప్రజలపై ఉందని, ఖానాపూర్ మున్సిపలిటీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి అధికార పార్టీకి బలాన్ని ఇవ్వాలని, టిఆర్ఎస్, బిజెపి పార్టీలు రెండు కుమ్మక్కై వారికి అనువుగా ఉన్నవార్డులలో తమ తమ పార్టీల అభ్యర్థులను నిలిపి కాంగ్రెస్ పార్టీని ఓడించాలని చూసిన ప్రజలు అభివృద్ధికే పట్టం కడతారని, కాంగ్రెస్ పార్టీలో తాము నిలబెట్టిన అభ్యర్థుల వివరాల గురించి పూర్తి సర్వేల ద్వారానే తమ అభ్యర్థులను నిలిపామని, ఎవరో చెప్తే తమ అభ్యర్థులను నిలపలేదని ఖానాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీ జెండా మున్సిపాలిటీలో ఎగరవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మజీద్, మండల అధ్యక్షుడు దయానంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, యూసఫ్ ఖాన్, జంగిల్ శంకర్, అబ్బు బాయ్, శేషాద్రి, దాత్రిక రాము తదితరులు ఉన్నారు.

# నామినేషన్ల పరిశీలనను సమర్థవంతంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** నామినేషన్ల పరిశీలనను సమర్థవంతంగా నిర్వహించాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్వో, ఏఆర్వోలను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం ఆర్వో ఏ ఆర్వో ఇతర ఎన్నికల అధికార సిబ్బంది తో సమీక్షా సమావేశం జరిగింది. ఎన్నికల సంఘం ఆదేశాలు, సూచనలను అనుసరించి చేపట్టాల్సిన నామినేషన్ల స్వీకరణ, వాటి పరిశీలన, ఇందులో అనుసరించాల్సిన నియమ నిబంధనలు, పరిగణలోకి తీస్కోవాల్సిన అశాల పై రిటర్నింగ్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. 31 వ తేదిన (శనివారం) జరగబోయే (స్ృటినీ) నామినేషన్ల పరిశీలన ప్రక్రియకు పలు సూచనలు చేశారు.నామినేషన్ల పరిశీలన కోసం స్పెషల్ సూపర్ వైజర్లను నియామకం చేశామని, వారు కూడ పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు.

**పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేయాలి:** నగరపాలక సంస్థ పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కరీంనగర్ నగరంలో శుక్రవారం రోజు ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అధికారులతో కలిసి సందర్శించారు. 13వ తేదిన జరగబోయే ఎన్నికల మెటిరియల్ డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్, బ్యాలెట్ బాక్సుల బద్రపరిచే గతికి సంబంధించి ఏర్పాట్లను తనిఖీ చేసి పరిశీలించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పై అధికారులకు పలు సలహాలు సూచనలు చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ దిలీప్ కుమార్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, డీసిపి బషిరొద్దిన్ ఏసిపి వేణు పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండల కేంద్రంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పెద్ది కుమార్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కనుమల్ల సంపత్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రజల ఉద్యమంగా మార్చి సామాన్యుడు కూడా శక్తి ఉందని నిరూపించిన గొప్ప నాయకుడు గాంధీ అన్నారు. సత్యం, అహింస, త్యాగం ఈ మూడు ఆయుధాలతోనే గాంధీజీ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొన్నారు. హింసకు హింసతో కాదు, ప్రేమకు ప్రేమతో సమాధానం చెప్పాలి అనే సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రజల ఉద్యమంగా మార్చి, సామాన్యుడికి కూడా శక్తి ఉందని నిరూపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త వార్డ్ మెంబర్ గోలి కిరణ్, గూడెపు ఓదెలు మూడెడ్ల రమేష్, జక్కు కుమారస్వామి, రావుల రాజబాబు, కట్టల కుమారస్వామి, పెద్ది అభిలాష్, దార నరేష్ తో పాటు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి సమ్మక్క సారలమ్మ ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం ప్రేమలత దంపతులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య,మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు వాజిద్ పాషా,ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు అల్లం కుమారస్వామి,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బక్కతట్ల వినీత్ అనంతరం సమ్మక్క సారలమ్మ దేవస్థాన కమిటీ సభ్యులు నాయకులకి శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పర్శ ఓదెలు,యువజన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు వార్డు సభ్యులు దొమ్మటి రాజేందర్, అల్లం శేఖర్,పర్శ సౌందర్యరమేష్, ఏఎంసి డైరెక్టర్ జాగరి సమ్మయ్య, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు సోమిశెట్టి శ్రీనివాస్, మాట్లా రవీందర్,తన్నీరు రాజేశం,పర్శ సాయిలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్, యువజన నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో ఎస్సీ వర్గాల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడే లా సమగ్ర చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి గూడె శ్రీనివాస్ ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కరీంనగర్‌కు వచ్చిన ఆయన ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్‌తో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ వర్గాల సంక్షేమానికి అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. ఎస్సీలపై జరుగుతున్న వివక్ష, అణచివేత ఘటనలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే అధికారులు స్పందించాలని ఆయన సూచించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వేగవంతమైన విచారణ చేపట్టి బాధితులకు తక్షణ సహాయం అందేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామ స్థాయి వరకు సంక్షేమ పథకాలు అర్హులైన అందేలా చర్యలు తీసుకోవాల ని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత పెంచాలని సూచించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న విద్య, ఉపాధి, గృహనిర్మాణం, ఆరోగ్యం, సామాజిక భద్రత పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు నాగేలేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అనిల్ ప్రకాష్, ఏసీపీ వెంకటస్వామి సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ పార్టీలోకి చేరికలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** 42వ డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఖలీద్ ఆలీ వారి అనుచరులు 20 మందితో కలిసి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గంగుల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఖలీద్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గంగుల కమలాకర్ నాయకత్వంలో నగరం ఎంతగానో అభివృద్ధి చెందిందని, ఈ రెండేళ్ల కాంగ్రెస్ , బిజెపి ప్రభుత్వాల పాలనలో కరీంనగర్ ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదని, కరీంనగర్ అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ పార్టీ ద్వారానే అభివృద్ధి చెందుతుందని, మాజీమంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ నాయకత్వంలో పనిచేయాలని పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట మాజీ కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్ రావు, నాయకులు నందెల్లి మైనార్టీ పట్టణ యువత అధ్యక్షులు నవాజ్ హుస్సేన్, నాయకులు సుధాకర్ రావు, ఎండి గౌసుద్దీన్, సిద్దిక్, సోయబ్ , కబీర్ ఖాన్, ఇర్ఫాన్, సైఫ్, ఫరూక్, అయూబ్, అంజద్, అఫ్జల్ తదితరులు ఉన్నారు.

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గంగుల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## బిజెపిలో చేరిన బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్,



**ప్రజాపక్షం/కరీంనగర్:** బీఆర్ఎస్ సీనియర్ నేత, 35వ వార్డు కార్పొరేటర్ సాధవేని శ్రీనివాస్ బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనతో పాటు కరీంనగర్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బండి ప్రశాంత్ సైతం కాషాయ కండువా కప్పుకున్నారు. కొద్దిసేపటి క్రితం తమ అనుచరులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిశారు. వారికి కాషాయ కండువా కప్పి బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధి కోసం నయాపైసా తీసుకురాలేదంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చుతూ కరీంనగర్ కార్పొరేషన్ అభివృవుదికి కేంద్రం తెచ్చిన నిధుల వివరాలను వెల్లడించారు. కేంద్రం నుండి దాదాపు 1500 కోట్ల రూపాయలకు పైగా నిధులు తెచ్చి కరీంనగర్ ను అభివృవుది చేశానని తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ కళ్లుండి చూడలేని కబోధులు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలని మండిపడ్డారు. ఎలక్షన్స్ సమయంలో తప్ప కరీంనగర్ ముఖం చూడని నాయకులు తనపై ఆరోపణలు చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ ప్రజల పక్షాన నేను చేసిన పోరాటాలు, కేంద్రం నుండి ఎన్ని నిధులు తెచ్చానో, ఏయే ప్రాజెక్టులు, పథకాలు తీసుకొచ్చానే ప్రజలకు తెలుసనని పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు మున్సిపాలిటీల్లో మీ కళ్ల ముందు కన్పిస్తున్న ప్రతి పని, జరిగిన అభివృవుది కేంద్రం ఇచ్చిన నిధులతోనే జరిగిందనేది ముమ్మాటికీ నిజం. ఎన్నికల ప్రచారంలో పూర్తి వివరాలతో ప్రజలకు ముందుకు వెళతానని స్పష్టం చేశారు.

## బంగారు ఆభరణాలు చోరీ

**ప్రజాపక్షం/చొప్పదండి:** సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బంగారు ఆభరణాల చోరికి గురైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని మర్లవాడకు చెందిన అమరగొండ బీరయ్య గురువారం రాత్రి చొప్పదండి లోని సమ్మక్క సారలమ్మ జాతరకు కుటుంబతోకలసి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నారు.శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఎవ్వరో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి అతని ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో 28 గ్రాముల బంగారు ఆభరణాలు,150 గ్రాముల వెండి పట్టపగలు దొంగించుకొని వెళ్లారు.బాధితుని పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించినట్లు,నిందితులను పట్టుకోడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

## వైద్య, పారిశుద్ధ్య సిబ్బంది సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోయల్‌వాడ శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతర వద్ద భక్తుల కోసం వైద్య, ఆరోగ్యశాఖ వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. శుక్రవారం వైద్య శిబిరాన్ని అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్ పరిశీలించారు. వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందిని ఆయన అభినందించారు. అదేవిధంగా జాతర ప్రారంభమైన రోజు నుంచి నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్న ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, పారిశుద్ధ్య కార్మికులను తహసీల్దారు అభినందించారు. ఏర్పాట్లు, సౌకర్యాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. స్వచ్ఛంధంగా సేవలు అందిస్తున్న విద్యార్థులు, యువకులను అభినందించారు. జాతర ప్రాంగణమంతా పర్యటించి ఏర్పాట్లు, సౌకర్యాలకు సంబంధించిన అంశాలను స్వయంగా పరిశీలించి ఎప్పటికప్పుడూ సూచనలు ఇస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్లు తహసీల్దారు రవీందర్ తెలిపారు.

## వనదేవతల వైభవం.. భక్తజన పారవశ్యం..!

**ప్రజాపక్షం/గోదావరిఖని :** నభూతో, నభవిష్యత్తు అన్నట్టుగా కనీ వినీ ఎరగని రీతిలో గోదావరిఖని కోల్‌బెల్ట్ శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతర వైభవాన్ని సంతరించుకున్నది. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ ప్రత్యేక చొరవతో స్థానిక పరిశ్రమలు, నగరపాలక సంస్థ సహకారంతో సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు, సౌకర్యాల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సమ్మక్క, సారలమ్మలను దర్శనం చేసుకునేందుకు లక్షలాది మంది భక్తులు జాతర ప్రాంగణం వద్దకు చేరకున్నారు. అమ్మవార్లకు తలనీలాలు సమర్పించి ఇక్కడి గోదావరినదిలో పుణ్యస్నానాలు చేశారు. అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. తమను సల్లంగా చూడాలంటూ కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కుటుంబసభ్యులతో కలిసి వంటవార్పుతో విడిది ఏర్పాటు చేసుకున్నారు. జాతర ప్రాంగణమంతా భక్తుల కోలాహలంతో సందడి నెలకొంది. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్, ఆయన సతిమణీ మనాలి ఠాకూర్‌లు జాతరను సందర్శించారు.

అమ్మవార్లను దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించారు. అమ్మవార్లను దర్శనం చేసుకునేందుకు అందరూ కుటుంబసభ్యులతో కలిసి జాతర వైపు కదులుతున్నారు.

## సిఎం కప్ క్రీడల ప్రారంభం

**ప్రజాపక్షం/రాయికల్ :** అల్లీపూర్ గ్రామంలో రాయికల్ రూరల్ మండల స్థాయి సి.ఏం.కప్ క్రీడలను శుక్రవారం ఎంపిడీవో చిరంజీవి ప్రారంభించారు. దీనిలో భాగంగా వాలీ బాల్,కబడ్డీ, ఖో, ఖో, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి. ఎం.కప్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి మన మండలం జిల్లా స్థాయిలో బహుమతులు సాధించి రాష్ట్ర స్థాయి లో పాల్గొనాలని అన్నారు. అనంతరం ఎం పి వో సుష్మ మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసికోల్లసం శారీరక దృఢత్వం పెంపొందిందని అన్నారు. అల్లీపూర్ గ్రామ సర్పంచ్ ఎంబరీ సుష్మ మాట్లాడుతు క్రీడలు ఆడడం ద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ వో. రాఘవులు,గ్రామ సెక్రటరీ శేఖర్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్,పిడి.లు కృష్ణప్రసాద్ , రాజగోపాల్, సుజాత,ప్రతాప్,గంగాధర్, సుప్రియ లు పాల్గొన్నారు.

# ప్రజలను సల్లంగా చూడాలంటూ ఎమ్మెల్యే పూజలు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో చేపడుతున్న శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతరను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. వనదేవతలకు కొబ్బరికాయలు కొట్టి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ప్రజలకు ఏ కష్టం రాకుండా సల్లంగా చూడాలంటూ అమ్మవార్లను వేడుకున్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణ, ఏర్పాట్లు, సౌకర్యాలకు సంబంధించి సంతృప్తి వ్యక్తం చేస్తూ జాతర కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. జాతరకు వచ్చిన భక్తులతో మాట్లాడారు. అందరిని పలకరిస్తూ చిన్నారులతో సందడి చేశారు. జాతరకు వస్తున్న భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు, జాతర కమిటీ నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ గాలిపెల్లి తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## సమ్మక్క-సారమ్మలను దర్శించుకున్నా కటారి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ ఎక్స్ రోడ్ సమీపంలోని ఎక్కల దేవి గుట్ట కింద అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా గద్దెపై కొలువుతీరిని సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల ను శనివారం మాజీమాజీ జడ్పీటీసీ,మాజీ ఎంపీపీ, మాజీ సింగిల్ విండో చైర్మన్, మాజీ గ్రంథాలయ చైర్మన్,జిల్లా సీనియర్ నాయకులు కటారి చంద్రశేఖర్ రావు దర్శించుకొని మొక్కులు సమర్పించారు.అనంతరం సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు,గ్రామ సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్ చంద్రశేఖర రావు ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కటారి మాట్లాడుతూ వనదేవతలను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని,తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ఆత్మగౌరవ ప్రతీకని చెప్పారు.సమ్మక్క సారలమ్మ కోరిన కోరికలు తీరుస్తూ ప్రజల కష్టాలను నెరవేరుస్తున్న గిరిజన ఆదివాసి దైవం సమ్మక్క సారక్క అని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్,ఉప సర్పంచ్ దీటి మహేష్, కిష్టంపేట రమేష్ రెడ్డి, అద్వకేట్ విశాల్ ఆదిత్య రావు,వెంకటేష్, గంగారాం నవీన్, కృష్ణ ,రవి,తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సిఎం కప్ పోటీలు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లో నిర్వహించే సీఎం కప్ మండల స్థాయి పోటీలను ఈనెల 3,4 తేదీలలో నిర్వహిస్తామని మండల విద్యాధికారి బండారి మధు శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు రిజిస్ట్రేష న్ ఫారం, వయస్సు ధ్రువీకరణ కోసం పదవ తరగతి మెమో లేదా బర్త్ సర్టిఫికెట్ తో పీఎం శ్రీ ఇబ్రహీంపట్నం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో ఈ నెల 3న ఉదయం 9 గంటలకు హాజరు కావాల్సిందిగా ఎంఈఓ పేర్కొన్నారు. ఈనెల 3న బాల బాలికలకు కబడ్డీ,ఖో ఖో ,వాలీబాల్, 4 న బాల బాలికు అథ్లెటిక్స్, చెస్ పోటీలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు పిడి రాజు 9441183055, రవి 9490683248, అనిత 8919053309 లను సంప్రదించలని మండల విద్యాధికారి బండారి మధు విద్యార్థులకు సూచించారు.

## నామినేషన్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న ఎస్.ఎస్.టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్ పోస్టును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, నోడల్ అధికారులు నవీన్ కుమార్, శ్రీనివాసాచారి, తహసీల్దార్లు జయంత్ కుమార్, మహేష్ కుమార్, టీపీఓ అన్సార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు ఉన్నారు.

**ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ తనిఖీ..**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రగుడు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ లో ఉన్న సిబ్బంది వద్ద ఉన్న వివిధ రిజిస్టర్లు పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 20 లక్షల డబ్బులు సీజ్ చేశామని, తదుపరి విచారణ కోసం పోలీసులకు అప్పగించామని అధికారులు తెలిపారు. తనిఖీలో నోడల్ అధికారులు నవీన్ కుమార్, భారతి ఉన్నారు.

## వేములవాడలో బిఆర్ఎస్‌కు షాక్!



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల వేళ బిఆర్ఎస్ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. గత కొంతకాలంగా బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న డాక్టర్ నరేష్ బిఆర్ఎస్ పార్టీకి అధికారికంగా రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు. బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, మాజీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ సమక్షంలో డాక్టర్ నరేష్‌కు పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ నరేష్ లాంటి విద్యావంతులు, ప్రజల్లో మంచి పేరు కలిగిన నాయకులు బిజెపిలో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బిజెపి పార్టీలో చేరినట్లు చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వేములవాడ అభివృద్ధికి బిజెపి పార్టీ కట్టుబడి ఉందని, ప్రజలంతా బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డ్ సభ్యులు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సంటి మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షులు జిల్లా ఎన్నికల ఇన్చార్జ్ లింగంపల్లి శంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి వివేక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** సమ్మక్క సారలమ్మ అమ్మ వాళ్ళ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆ తల్లుల అనుగ్రహంతో ప్రజలు సుఖ సంతోషాలతో ,అష్టైశ్వర్యాలతో, పాడి పంటలతో, పిల్లాపాపలతో ,కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి ఆ అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు .శనివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ ఎక్స్ రోడ్ సమీపంలోని ఎక్కల దేవి గుట్ట కింద అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతరను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ తో కలిసి వారు సమ్మక్క సారలమ్మ మన దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని తల్లులను కోరుకున్నట్లు తెలిపారు.ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపాలైన సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకోవడం సంస్కృతి,సంప్రదాయాలు ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు.అనంతరం మండలంలోని దట్నూర్ గ్రామానికి చెందిన కార్యకర్త జక్కుల వినోద్ ప్రమాదవశాత్తు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని పరామర్శించి జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్ భీమ సంతోష్ ,సర్పంచ్ లు దాసరి తిరుపతి గౌడ్ ,గంగన్న ,కాసారపు భవాని అరవింది గౌడ్,మాజీ సర్పంచ్ లు చిర్ర గంగాధర్ ,రేవెల్ల సత్యనారాయణ గౌడ్ ,పురం శెట్టి వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సమ్మక్కసారలమ్మ జాతర మహోత్సవం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని బొప్పాపురం గ్రామంలో శుక్రవారం సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభవంగా కొనసాగింది.ఆలయంలో అమ్మవారిని జిల్లా రెడ్డిసంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి,సెస్ మండలధ్యక్షులు కృష్ణహరి హాజరై దర్శించుకున్నారు.సర్పంచ్ అవ్వర్యంలో ఘనంగా జాతర ఏర్పాట్లను చేశారు.కార్యక్రమంలో పాలకవర్గం,గ్రామస్థులు అదిక సంఖ్యలో హాజరయ్యారు.

## సిఎం కప్ పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/చందుర్తి :** మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం లో శుక్రవారం సీఎం కప్ పోటీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ధృఢత్వం తో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.విద్యార్థులు గెలుపోటములు సమానంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.ఆటలలో మంచి ప్రతిభ కనభరిస్తే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయన్నారు.ఈ కార్యక్రమం లో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు , ఎంపిడీఓ రాధ , ఎంఇఓ వినయ్ కుమార్ , ఎస్సై జిల్లెల్ల రమేష్ , సర్పంచ్ పులి సత్యం ,ఉప సర్పంచ్ బత్తుల క్రాంతి , ఉపాధ్యాయులు కాపిల్ల నరేష్,వ్యాయమ ఉపాధ్యాయులు , మండల పరిషత్ సిబ్బంది , నాయకులు పాల్గొన్నారు.

## 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** 2010 సంవత్సరం కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యనారాయణ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కేజీ టు పీజీ క్యాంపస్ లో డిటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆరు డిఎ బకాయిలను మంజూరు చేయాలని, పిఆర్సి కమిటీ నివేదికను తెప్పించుకొని వెంటనే పిఆర్సి ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహించిన, ఉపాధ్యాయులకు వెంటనే ప్రభుత్వం రెన్యుమరేషన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ మండల అధ్యక్షులు షీలా కుమార్, ప్రధాన కార్యదర్శి దోసల మధు , మండల విద్యాధికారి సంటి గంగారాం, మండల కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ రెడ్డి, పాశం తిరుపతిరెడ్డి, లక్ష్మ ణ చారి, చీకట్ల రాజు, శ్రీకాంత్ రెడ్డి, పరశురాములు, సాయి ,గంగా, శాంత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

**ప్రజాపక్షం/ధర్మపురి :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లాకు నియమితులైన ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు శుక్రవారం ధర్మపురి మున్సిపల్ లో జరుగుతున్న నామినేషన్ సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు ఎన్నికల నియమావళి ప్రకారం విధులు నిర్వహించాలని తెలిపారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను ఉపయోగించుకునేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, సీఐ రాం నర్సింహారెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాస్,సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** పదవ తరగతిలో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి బండారి మధు అన్నారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఆంగ్ల ఉపాధ్యాయులకు గోదురు హైస్కూల్ కు చెందిన హిందీ ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్,సి ఆర్ పి లు రవీందర్, శివరాం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తండ్రే కాలయముడయ్యాడా..?

## వీడిన కాల్వలో బాలిక శవం మిస్టరీ

### మృతురాలు మహారాష్ట్ర వాసి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్ శివారులోని డి46 కెనాల్‌లో గురువారం లభ్యమైన గుర్తు తెలియని బాలిక మృతదేహం కేసులో కీలక పురోగతి లభించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వార్తల ఆధారంగా పోలీసులు జరిపిన విచారణలో ఆ బాలిక వివరాలు వెల్లడయ్యాయి. మృతి చెందిన బాలిక మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా, ముఖేడ్ తాలూకా, కేరూర్ ప్రాంతానికి చెందిన ప్రాచీగా పోలీసులు గుర్తించారు. కూతురిని తీసుకొని బైక్ పై వెళ్లిన భర్త తిరిగి రాలేదని బాలిక తల్లి అంకిత ఇచ్చిన సమాచారంతో ఈ మిస్టరీ వీడింది. బాలిక మరణంపై పోలీసులు ప్రాథమిక విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మృతురాలి తండ్రి పాండురంగ, బాలికను బైక్‌పై తీసుకెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయనే ఈ ఘూతుకానికి ఒడిగట్టి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే పాండురంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్ర నుంచి ఇక్కడి వరకు బాలిక మృతదేహం ఎలా వచ్చింది..? ఇంది ముందస్తు ప్రణాళికతో చేసిన హత్యేనా..? అనే కోణంలో పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, బాలిక తండ్రిని విచారిస్తున్నామని, పూర్తి వివరాలు



త్వరలోనే వెల్లడిస్తామని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్సై రమ తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. కన్న తండ్రే కాలయముడిగా మారాడా..? అనే కోణంతో పాటు ఇతర కోణాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

## ఘనంగా మహాత్మ గాంధీ వర్ధంతి



**ప్రజాపక్షం/పాపన్నపేట:** సత్యం, అహింస మార్గాలను బోధించిన జాతిపిత మహాత్మా గాంధీని ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు రాజేందర్ కుమార్ గుప్తా అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని పోడ్చాన్ పల్లిలో హనుమాన్ ఆలయ ఆవరణలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాత్మ గాంధీ దేశ స్వతంత్రం కోసం పోరాడి ప్రాణాలర్పించిన రోజును అమరవీరుల దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. కిష్టయ్య, మల్లేశం, మాటూరి మల్లేశం, బుజ్జయ్య పాల్గొన్నారు.

## కారెక్కిన కాంగ్రెస్ నేత

### మాజీ మంత్రి హరీష్‌రావు సమక్షంలో చేరిన సుప్రబాతరావు

**ప్రజాపక్షం/రామాయంపేట:** మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆపార్టీకి చెందిన సీనియర్ నాయకులు చౌదరి సుప్రబాతరావు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి మాజీ మంత్రి హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. మున్సిపల్ ఎన్నికల్లో రామాయంపేట చైర్మెన్ పీఠం ఆశించిన ఆయనకు అధిష్టానం నుండి ఆమోదం లభించలేదు. దీంతో అసంతృప్తికి లోనైన సుప్రబాత్‌రావు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డిల అధ్వర్యంలో శుక్రవారం హరీష్‌రావు నివాసంలో బిఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యకర్తకు, నాయకులకు బిఆర్ఎస్ కుటుంబం అం దగా ఉంటుందని ఎవరూ అద్దైర్యపడాల్సిన అవసరంలేదని హరీష్ రావు బరోసా కల్పించారు. సుప్రబాత్‌రావుతో పాటు ఆయన కుమారుడు చౌదరి పృథ్వీ, దోమకొండ యాదగిరి, దోమకొండ శ్రీనివాస్, మర్కు అజేష్, తాటిపల్లి రాంకీలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## సర్పంచ్‌ల ఫోరం మండలం అధ్యక్షుడిగా శివకుమార్

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా మైదంబండ సర్పంచ్ బియ్యని శివ కుమార్ ను నియమించిన ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుఈ సందర్భంగా మైదం బండ సర్పంచ్ బియ్యని శివ కుమార్ మాట్లాడుతూతనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శిదుద్దిల్ల శ్రీను బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే, తన నియామకానికి సహకరించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుచొప్పరి సదానందంకి, మండల పార్టీ అధ్యక్షులుదొడ్డ బాలాజీకి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, డైరెక్టర్ లు బోల్నేని బుచ్చం రావు,జాగిరి సమ్మయ్య,మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు వాజిద్ పాషా, బీసీ సెల్ మండల అధ్యక్షులు అల్లం కుమారస్వామి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గాదం శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎడవెన సంపత్, మహిళా



కాంగ్రెస్ అధ్యక్షురాలు గోవిందుల పద్మ, సర్పంచ్ లు చిలివేరి జ్యోతి లక్ష్మ ణ్, మెంగని సమత తిరుపతి, పెగుడ తిరుమల కుమార్,రాపెల్లి రాజయ్య, బొంతల అన్నపూర్ణ ఉపేందర్, గడ్డం రాజేశం,చొప్పరి సంపత్,తాని ప్రభాకర్, ఇండ్ల కృష్ణవేణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## మోరపెల్లి గ్రామంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

### మోరపెల్లి గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని మోరపెల్లి గ్రామంలో నూతన పాలకవర్గం ఏర్పాటు అనంతరం మొదటి గ్రామ సభ సమావేశంను శుక్రవారం నిర్వహించారు. గ్రామ సభకు ముఖ్యఅతిథిగా జగిత్యాల రూరల్ ఎస్సై ఉమ సాగర్ పాల్గొన్నారు. ఎస్సై ఉమ సాగర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రయోజనాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ఎవరైనా అనుమాస్పదంగా కనిపించినచో, ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినచో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జగిత్యాల రూరల్ ఎస్సై ఉమ సాగర్ గ్రామ ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్ అధ్యక్షతన గ్రామ సమస్యల గురించి చర్చిస్తూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు, హైమాక్స్ లైట్స్, గుడి వద్ద రెండు బోర్లు వేయడం, మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలకి మరమ్మత్తులు చేయించడం, గ్రామ పంచాయితీ ట్రాక్టర్ రిపేరు, వైకుంఠ రథం కొనుగోలు గురించి, గ్రామంలోనీ



పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మోరపెల్లి గ్రామంలో నూతన పాలకవర్గం తీర్మానం చేశారని, గ్రామంలో ఎలాంటి సమస్యలకు తావు లేకుండా ప్రతి సమస్యను పరిష్కారం చేస్తామని మోరపెల్లి గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోరపెల్లి గ్రామ ఉప సర్పంచ్, వార్డుసభ్యులు పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లులు, అంగన్వాడీ టీచర్లు, ఎల్ఎం కరెంటు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## హిందీ భాషతో జాతీయత నిర్మాణం

**ప్రజాపక్షం/రాయికల్ :** జాతీయభాష హిందీ ద్వారా విద్యార్థులలో జాతీయభావాలు పెంపొందుతాయని, దేశ భక్తి కలిగిన ఉత్తమ పౌరులుగా వారు ఎదుగుతారని తాట్లావాయి కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బోగ రమేష్ అన్నారు. జడ్పీహెచ్ఎస్ తాట్లావాయి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన హిందీ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష దేశవ్యాప్త ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, భిన్న భాషలు, సంస్కృతులు కలిగిన భారతదేశాన్ని ఒక్కటిగా కట్టిపడేసే శక్తి హిందీకి ఉందని పేర్కొన్నారు. ఆరవ, ఏడవ తరగతి విద్యార్థులకు హిందీ వర్ణమాల,గుణితాలు పటిష్టంగా నేర్పి, వారు ఎనిమిదో, తొమ్మిదో, పదవ తరగతులకు వచ్చేసరికి హిందీని స్పష్టంగా చదివే స్థాయికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇది విద్యార్థుల భాషా నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా జాతీయ చైతన్యాన్ని బలపరుస్తుందని తెలిపారు. జాతీయభాష అభివృద్ధి బాధ్యత ప్రతి హిందీ ఉపాధ్యాయుడిపైనే ఉందని, అందరూ సమిష్టిగా కృషి చేసి హిందీ భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు చేరువ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పలువురు హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** 2వ మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నామినేషన్ కేంద్రాలను జిల్లా జనరల్ అబ్జర్వర్ సిహెచ్ సత్యనారాయనరెడ్డి పరిశీలించారు. భీమ్‌గల్ ఎంపీడీఓ, ఐకెపి కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన కేంద్రాల్లో విధి నిర్వహణలో ఉన్న రిటర్నింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ పార్టీల నుండి ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ చేసేందుకు సమర్పిస్తున్న నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలన్నారు. మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్, తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఎంపీడీఓ గంగలు సంతోష్‌కుమార్ ఉన్నారు.

## బిజెపిలో తన సత్తా నిరూపిస్తా

### మాజీ ఎంపిపి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పిఎం మోడీ నాయకత్వ లక్షణాలు, పాలన చూసి తానే స్వయంగా బీజేపీ పార్టీలో చేరినట్లు మాజీ ఎంపీపీ కొండ గోదావరి స్పష్టం చేశారు. శుక్రవారం నామినేషన్ వేసిన అనంతరం బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి, మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు పూస రాజుతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ పార్టీ బలపర్చిన అభ్యర్థిగా 5వ వార్డు నుండి పోటీలో ఉన్నట్లు ప్రకటించారు. భీమ్‌గల్ మున్సిపల్ కారల్యాయపై బీజేపీ జెండా ఎగరవేయటమే తన లక్ష్యమన్నారు. బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎంపీపీ బీజేపీలో చేరటంతో పార్టీ మరింత బలోపేతమైందని, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి జండా ఎగురవేస్తామన్నారు. ఇదే ఊపుతో రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా బీజేపీ తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడమే టార్గెట్‌గా ముందుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆరే రవీందర్, పట్టణ అధ్యక్షులు కనికరం మధు, యోగేశ్వర్, నర్సయ్య, లక్ష్మ ణ్‌గౌడ్, నిచ్చమొల్ల నవీన్, హరిప్రసాద్, సంధ్యరాజు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం

### 12 వార్డులలో 113 నామినేషన్లు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపల్ 2వ విడత సాధారణ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నాటికి నామినేషన్ల పర్వం ముగిసింది. పట్టణంలో మొత్తం 12 వార్డులకు గాను 113 నామినేషన్ పత్రాలను వివిధ పార్టీల అభ్యర్థులు సమర్పించారు. ఉదయం 10 గంటలకు నామినేషన్ల సమర్పణ ప్రారంభం కాగా సాయంత్రం ఐదు గంటల వరకు చివరి రోజు 84 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ పర్వం ప్రారంభమైన మొదటి రోజు 4, రెండవ రోజు 25, చివరి రోజు 84 నామినేషన్ పత్రాలు అభ్యర్థులు సమర్పించారు. ముగింపు నాటికి మొత్తం 113 నామినేషన్ పత్రాలు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బీఎస్పీ నుండి 5, బీజేపీ నుండి 28, కాంగ్రెస్ నుండి 39, బీఆర్ఎస్ నుండి 27, ఇండిపెండెంట్ అభ్యర్థులు 10 జనసేన ఇతర్ స్టేట్ లలో నమోదు చేసుకున్న పార్టీల నుండి 4 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



# మృత్యుపాశంలా మారిన నాలా రాడ్లు!

### నిత్యం ప్రమాదాలే.. అధికారులు పట్టించుకోరా?

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణ ప్రజలు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారుల నిర్లక్ష్యం, పనుల్లో నాణ్యత లోపం వెరసి సామాన్య ప్రజల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. పట్టణంలోని రాజ్ కుమార్ లాడ్జ్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న నాలాపై వేసిన ఇనుప రాడ్లు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

### కుంగిపోయిన రాడ్లు.. పొంచి ఉన్న ప్రమాదం

నాలాపై రాకపోకల కోసం ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు నిత్యం వందలాది వాహనాలు వెళ్లడంతో తీవ్రంగా కుంగిపోయాయి. రాడ్ల మధ్య ఖాళీలు ఏర్పడటం, అవి కిందికి వంగిపోవడంతో ద్విచక్ర వాహనాల టైర్లు అందులో ఇరుక్కుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వేగంగా వచ్చే వాహనదారులు ఈ కుంగిన రాడ్లను గమనించలేక అదుపు తప్పి పడిపోతున్నారు. ఫలితంగా నిత్యం ఎవరో ఒకరు గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్ళముందే ప్రమాదాలు జరుగుతున్నా, వాహనదారులు గాయపడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. సమస్య తీవ్రతపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆరోపిస్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. కుంగిన నాలా రాడ్ల వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, చిన్న



పిల్లలు, వృద్ధులు అటువైపుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన ఈ నాలాపై శాశ్వత పరిష్కారం చూపాలని, కుంగిన రాడ్ల స్థానంలో పటిష్టమైన నిర్మాణం చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఈ సమస్యకు ముగింపు పలకాలని స్థానికులు కోరుతున్నారు.

## మహాత్ముడి సేవలు మరువలేనివి

### ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం జుక్కల్‌లో మహాత్ముని వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా మార్గంలో దేశ స్వాతంత్ర్య సాధనకు నాయకత్వం వహించి సత్యం, న్యాయం, సమానత్వం గ్రామ స్వరాజ్యం వంటి విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడని కొనియాడారు. పేదలకు, గ్రామీణ ప్రజల అభ్యున్నత గాంధీజీ కల అని గుర్తు చేశారు. గాంధీజీ ఆశయాలకు ప్రతీకగా తీసుకువచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టటం ద్వారా ప్రజలకు ఏడాదికి కనీసం 100 రోజుల పని దినాలు కల్పించి వారి జీవన భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ధారించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భయం వీడండి.. ఇష్టపడి చదవండి

### మోటివేషనల్ స్పీకర్ రమేష్

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడి ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శుక్రవారం పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాగ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన ప్రణాళిక, నిరంతర సాధన ద్వారానే అద్భుత ఫలితాలు సాధ్యమని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, రోజుకు ఎనిమిది గంటల నిద్ర, శారీరక వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. మానసిక భావోద్వేగాలను నియంత్రించుకుంటూ చదువుపై ఇష్టం పెంచుకోవాలని కోరారు. తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తెచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో లక్ష్య సాధనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పవన్ కుమార్, ఉపాధ్యాయులు రేణుక, రాజుకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికలను చదివిద్దాం.. ఎదుగనిద్దాం

### జిల్లా కలెక్టర్ కె. హరిత

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** బాలికలను రక్షించి, వారికి నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవ వేడుకలకు అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్య, హక్కుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై పోక్సో చట్టం ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారత దేశంలో మహిళలు రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి అత్యున్నత పదవులను



అధిష్టించి ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. బాలికలు తమకు లభించిన సౌకర్యాలను వినియోగించుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మహేష్, జిసిడిఓ శకుంతల, ఈఈ సిద్ధిక్, మడవి శంబు, శారద, రాణి, మమత, సఖి కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ శిబిరం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఫిజియో థెరపిస్టు అరుణ్ కుమార్ ఫిజియో థెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులచే ఇంటి వద్ద చేయించవలసిన వ్యాయామాల గురించి వారి తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుపతిరెడ్డి, ఫిజియోథెరపిస్టుతో పాటు ఐఈఆర్టీ సునిల్, చిన్న సాయిలు, కార్యాలయ సిబ్బంది పంచాక్షరి, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ నైతం మంగు శ్రీకారం



**ప్రజాపక్షం / తిర్యాణి :** విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు తలండి గ్రామ పంచాయతీ సర్పంచ్ నైతం మంగు ప్రత్యేక చొరవ చూపారు. మండలంలోని అమీన్ గూడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించనున్న మరుగుదొడ్ల పనులకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పారిశుద్ధ్య విషయంలో రాజీ పడకుండా విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని, భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పులి కొమురయ్య, ఎలుగతి వెంకటేశం, పులి అర్జున్, బొడ్డు సాయి, పెట్రాం శేఖర్, దుస్స మల్లీశ్వరి పాల్గొన్నారు.

## చిన్న అరటిపల్లిలో కొలువుదీరిన అడవి తల్లులు

**ప్రజాపక్షం / తిర్యాని :** మండలంలోని కన్నెపల్లి పంచాయతీ చిన్న అరటిపల్లిలో శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవం కనులపండువగా సాగుతోంది. జాతరలో అత్యంత కీలక ఘట్టాలు ముగియడంతో అడవి తల్లులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క అమ్మవార్లు గద్దెలపైకి చేరుకోవడంతో శుక్రవారం ఇద్దరు అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రధాన పూజారులు బొమ్మగోని సత్యగౌడ్, కరిగంటి బాపు అమ్మవార్లకు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. జాతర కమిటీ అధ్యక్షులు గుండం రారాజు ఆధ్వర్యంలో భక్తులకు



ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో తాగునీరు పంపిణీ చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీస్ యంత్రాంగం భద్రతను పర్యవేక్షిస్తుండగా, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. పెరుమండ్ల వెంకటేశం గౌడ్, బుద్దె విజయ్, తుమ్రం మాన్కు, మడావి రాజేష్, బొక్కనపల్లి సాయికిరణ్, బొమ్మగోని రాజ్ కుమార్, కరుగంటి రమేష్, అంకతి శ్రావణ్, భక్తులు పాల్గొన్నారు.

## గడలపల్లిలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి

**ప్రజాపక్షం / తిర్యాణి :** గడలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాళ్ల కన్నెపల్లి, గడలపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు నూతనంగా విద్యుత్ మీటర్లు, స్తంభాలను ఏర్పాటు చేశారు. డిపి జుగా పథకం ద్వారా చేపట్టిన ఈ పనులను స్థానిక సర్పంచ్ ఆత్రం శంకరమ్మ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి ఇటువంటి మౌలిక వసతుల కల్పన ఎంతో అవసరమని, దీనివల్ల విద్యుత్ సమస్యలు తొలగిపోతాయని సర్పంచ్ పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ మడావి గుణవంత్ రావు, ఉప సర్పంచ్ సోయం కట్టి, వార్డ్ మెంబర్ కోట్నాక ప్రవీణ్ కుమార్, గ్రామస్తులు సిడాం శేఖర్, సిడాం పాండు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** బార్ కౌన్సిల్ ఎన్నికల సందర్భంగా సిర్పూర్ టి జూనియర్ సివిల్ కోర్టులో శుక్రవారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జూనియర్ సివిల్ న్యాయమూర్తి అజయ్ ఉల్లాం ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా పోలింగ్ సజావుగా సాగిందని న్యాయవాదులు తెలిపారు. కోర్టులో నమోదైన న్యాయవాదులందరూ ఓటు వేయడంతో వంద శాతం పోలింగ్ నమోదైంది. ప్రజాస్వామ్య స్ఫూర్తితో న్యాయవాదులు ఎన్నికల్లో పాల్గొనడం ప్రశంసనీయమని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని న్యాయవాదులు సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.



## సిఎం కప్ క్రీడల విజేతలకు బహుమతుల ప్రదానం

**ప్రజాపక్షం / కేరమేరి :** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని కేరమేరి ఎంపిడిఓ సురేష్ అన్నారు. మండలంలోని హట్టి ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సిఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విజేతలకు సాకాడ సర్పంచ్ తుమ్రా లచ్చు, ఎంఇఓ ఆడే ప్రకాష్‌తో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

## అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ఖర్చులు వెల్లడించాలి

### జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి.వీరా రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులంతా తమ ఎన్నికల ఖర్చుల వివరాలను తప్పనిసరిగా నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి.వీరా రెడ్డి తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్‌తో కలిసి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.అభ్యర్థులకు ఎన్నికల వ్యయాలపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు అభ్యర్థుల ఖర్చులను నిరంతరం పర్యవేక్షిస్తూ,అన్ని రకాల ఫారాలు,రిజిస్టర్లను సక్రమంగా పూరించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు షుజావుద్దీన్,డీఈవో భోజన్న,డీసీఓ నర్సయ్య,అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల సమయస్ఫూర్తి బాలుడి ప్రాణాలు కాపాడిన వైనం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఇంటి గొడవలతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు యత్నించిన ఓ బాలుడిని నిర్మల్ పోలీసులు సకాలంలో స్పందించి ప్రాణాలతో కాపాడారు. ముప్కాల్ గ్రామానికి చెందిన 17 ఏళ్ల రామ్ చరణ్ అనే బాలుడు,తన కుటుంబంలో జరిగిన గొడవల వల్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.ఈ క్రమంలో జీవితం పై విరక్తి చెంది.నిర్మల్ పట్టణంలోని కంచరోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశాడు.ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యుత్ వేగంతో స్పందించారు.హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు,స్థానిక జాలర్ల సహాయంతో చెరువులోకి దూకి గాలింపు చేపట్టి బాలుడిని సురక్షితంగా బయటకు తీశారు.అనంతరం ఆ బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి,ప్రాథమిక వైద్య సహాయం అందించి కౌన్సిలింగ్ ఇచ్చారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా,బాలుడు ప్రస్తుతం క్షే మంగా ఉన్నాడని పోలీసపులు తెలిపారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన టౌన్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన పోలీసులను జిల్లా ప్రజలు,పలువురు ప్రముఖులు ముంచెత్తుతున్నారు.

# సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సిబ్బంది కేటాయింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్ సహా బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారులు (పిఒ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఎపిఒ), ఇతర పోలింగ్ సిబ్బందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. మొత్తం పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సిబ్బందితో పాటు 20 శాతం అదనంగా రిజర్వ్ సిబ్బందిని కూడా రాండమైజేషన్ ద్వారా కేటాయించామని వివరించారు. ఎన్నికల విధులకు ఎంపికైన సిబ్బందికి త్వరలోనే శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

### జిల్లా కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనక్కాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి బోధనా తీరు, విద్యా ప్రమాణాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై ప్రధానోపాధ్యాయుడిని అడిగి కారణాలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని పాఠశాలకు రప్పించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి తరగతులు నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం రుచికరంగా అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ నాణ్యమైన బోధన అందించాలని, పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి వారిని మానసికంగా సిద్ధం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నామమాత్రంగా ఉపాధి సామాజిక తనిఖీ

### రూ..37,411 రికవరీకి, ఫైనాల్టీ 3300 ఆదేశం

**ప్రజాపక్షం/తానూర్ :** మండలం కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై శుక్రవారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు.డీఆర్డీఓ విజయలక్ష్మి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో,2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకు మండలంలోని 32 గ్రామాల్లో జరిగిన పనుల నివేదికలను సామాజీక తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించారు .రూ.7 కోట్ల వ్యయం,లెక్కల్లో తేడాలు గడిచిన ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా మొత్తం రూ.7 కోట్ల వ్యయంతో అవ్వగా,ఇందులో కూలీల వేతనాల కోసం మెటీరియల్(సామగ్రి)ఖర్చుల కోసం వెచ్చించారు.అయితే,క్షేత్రస్థాయిలో తనికీలు నిర్వహించినప్పుడు సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది.తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించగా పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.పని ప్రదేశాల్లో కూలీల మస్టర్లపై అధికారులు రోల్‌కాల్ చేయకపోవడం,పనుల కొలతల్లో భారీగా వ్యత్యాసాలు ఉండటం,మస్టర్లలో కూలీల సంతకాలు,సరైన హాజరు లేకు న్నా వేతనాలు చెల్లించడం,హాజరు గణనలో తప్పులు మరి యు పని ప్రదేశాలు గుర్తింపులో తేడాలు,ఈ తప్పిదాలకు బాధ్యులుగా గుర్తించిన వారి నుండి మొత్తం రూ.37,411 రికవరీ,ఫైనాల్టీ రూ.23 వేలు,మొత్తం 60,411 రూపాయాలు జామ చేయాలని అధికారులు ఆదేశించారు.కోట్లలో ఖర్చు జరిగిన చోట కేవలం 37,411 రూపాయల రికవరీ చూపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఎంపీడీవో లు శ్రీధర్,నసీరోద్దీన్,ఈజీఎస్ ఏపీఓ శివలింగయ్య,టీఏలు,ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు,ఎఫ్ఏలు,సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ కూలిలు పాల్గొన్నారు.

# 12 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

### నిర్మల్ లో రైతు,కార్మిక సంఘాల పిలుపు..

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక,రైతు,సిఐటియు సంఘాలు పిలుపునిచ్చాయి.శుక్రవారం నిర్మల్ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆయా సంఘాల నాయకులు విడుదల చేశారు.కేంద్ర విధానాలపై ధ్వజం ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చిందని విమర్శించారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తూ,'వి బి జిరాంజీ' అనే కొత్త చట్టాన్ని తీసుకువచ్చి వ్యవసాయ కూలీల పొట్ట కొట్టాలని చూస్తోందని ఆరోపించారు.రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని,ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయకుండా పేద ప్రజలను అన్యాయం చేస్తోందని వారు ధ్వజమెత్తారు.ప్రదాన డిమాండ్లు..రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ పార్లమెంటులో ప్రత్యేక చట్టం చేయాలి.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి.కొత్తగా ప్రతిపాదించిన వి.బి.జిరాంజీ చట్టాన్ని రద్దు చేయాలి.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్,రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి,జిల్లా ఉపాధ్యక్షుడు సుంచుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.తమ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఈ సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని వారు కోరారు.

## కుష్ఠు రహిత జిల్లాగా మార్చుదాం

### డాక్టర్ అప్పల ప్రసాద్



**ప్రజాపక్షం / మందమర్రి :** జిల్లాను కుష్టు వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అప్పల ప్రసాద్ కోరారు. మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ తో కలిసి ఆయన స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 13 వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుష్టు వ్యాధి మైకో బ్యాక్టీరియం లేపే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఇది వంశపారంపర్యం కాదని పేర్కొన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే గుర్తించి చికిత్స పొందాలన్నారు. బాధితులను గుర్తించడంలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. అనంతరం కుష్టు నివారణపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమేష్, మానస, అధికారులు వెంకటేశ్వర్, నాందేవ్, రాఘవయ్య, బుక్క వెంకటేశ్వర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా పరిశీలకులు



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని మున్సిపల్ ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు సుజా ఉద్దీన్ సందర్శించారు.ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రంలో నామినేషన్లు స్వీకరించే అధికారులతో,నామినేషన్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతుందో అని వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్,తహశీల్దార్ సుజాత,ఎంపీడీవో రమాకాంత్,సిఐ అజయ్ కుమార్,వివిధ శాఖల అధికారులు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పంటల నూతన వంగడాలపై రబీంద్ర విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/ముథోల్:** పంటల నూతన వంగడాలపై రబీంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ శాస్త్రవేత్త ఆకుల దినేష్ అవగాహన కల్పించారు.శుక్రవారం పాఠశాల విద్యార్థులు మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఇందులో పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు.ఇందులో భాగంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు,చీడ పీడల నివారణ,అదేవిధంగా మృత్తిక క్రమక్షయం గురించి విద్యార్థులకు వివరించారు.ఆధునిక వ్యవసాయం పద్ధతులు ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనినద వివరించారు.రైతునుదేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అసంవార్ సాయినాథ్,మాట్లాడుతూ రైతు శ్రమిస్తేనే అందరికి అన్నం దొరికేదని రైతును మించిన గొప్ప వారెవరు కాదని స్పష్టం చేశారు.రైతన్నను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి గంగాధర్,జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీ రాజేందర్,మాధవి మేడం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి వేళ బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాపక్షం / నందిపేట్ : నందిపేట్ మండలంలో చాలా గ్రామాలకు రాత్రిపూట బస్సు సౌకర్యం ఉండడం లేదని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బస్సులు నడపాలని గ్రామాల సర్పంచ్‌లు కోరుతున్నారు. మాయాపూర్ సర్పంచ్ జీవన్, ఉమ్మెడ సర్పంచ్, లిఫ్ట్ చైర్మన్ ఓంకార్, బాద్గుణ సర్పంచ్ సుదలు నిజామాబాద్ ఆర్‌టిసి అధికారిని కోరారు.

## ఎత్తిపోతల పంప్‌లకు రూ. 1.48 కోట్లు మంజూరు

ప్రజాపక్షం / నందిపేట్ : నందిపేట్ మండలంలోని ఎత్తిపోతల పంప్‌ల మరమ్మతు పనులకు రూ. 1.48 కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు. పలు మార్లు శాసనసభలో రాసిన ప్రభుత్వం స్పందించి ఈ నిదులు విడుదల చేసింది. కొండూరు మారంపల్లి, వన్నెల్, నికాల్పూర్, తల్వేద ఎత్తిపోతల పంప్‌ల రిపేరుకు ఈ నిదులు ఖర్చు చేస్తారు.

## బిజెపిలో చేరిన మాజీ ఎంపిపి

ప్రజాపక్షం/భీమ్‌గల్ : బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీని నమ్ముకుని ఉన్న మాజీ ఎంపీపీ కొండ గోదావరి కుటుంబానికి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చేందుకు నిరాకరించింది. మొదటి నుండి పార్టీని నమ్ముకున్న తనకు పార్టీ మొండిచెయ్యి ఇవ్వటంతో షాక్‌కు లోనైన కొండ గోదావరి అనుకోకుండా బీజేపీ అక్కున చేరింది. నామినేషన్ చివరిరోజు వరకు టికెట్ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావటం, చివరికి బీజేపీ నాయకులు పార్టీలోకి ఆహ్వానించామన్నారు. రాజకీయ నేపథ్యమున్న కొండ ప్రకాష్‌గౌడ్ కుటుంబం టికెట్ నిరాకరణ విషయం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎలాగైనా తాను పోటీలో నిలబడి తన విలువ ఏంటో నిరూపించుకునేందుకు బీజేపీలో చేరి నామినేషన చివరి సమయంలో పట్టణంలోని 5వ వార్డు నుండి బీజేపీ బలపర్చిన అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయటం జరిగింది.మాజీ ఎంపీపీతో పాటు ఆమె కుమారులు కొండ రాముగౌడ్, కొండ నర్సాగౌడ్, సహా పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనికరం మధు, భీమ్‌గల్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి పూస రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ నుంచి మైనార్టీ మహిళ పోటీ



ప్రజాపక్షం/బోధన్: మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌లలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని గోశాల 27వ వార్డు నుంచి మైనార్టీ మహిళ ఆసియా బేగం భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మైనార్టీ మహిళ భారతీయ జనతా పార్టీ నుంచి పోటీ చేయడం బోధన్ మున్సిపల్ ఎన్నికల చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో బోధన్ పట్టణ రాజకీయాన్ని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

## సిఎం కప్ క్రీడా పోటీలకు ఎంపికైన శిశు మందిర్ విద్యార్థులు

ప్రజాపక్షం/ముధోల్ : మండల కేంద్రములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ముధోల్ మండల స్థాయి సిఎం కప్ పోటీల్లో శ్రీ సరస్వతీ శిశు మందిర్ ముధోల్ పాఠశాల విద్యార్థులు పాల్గొని మెరుగైన ప్రదర్శన కనబరిచి డివిజన్ స్థాయి సిఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు సారథి రాజు,తెలియజేశారు.గెలుపొందిన వారిలో ఆర్.సాత్విక్(జావెలిన్ త్రో),ఎస్.సారిక(డిస్క్ త్రో),ఆర్.యోగిత(త్రి యథ్లాన్)లో,బి.సాత్విక 3000 మీటర్ల పరుగు పందెంలో,యం.నీరజ్(త్రి యథ్లాన్ లో,ఎస్.గంగాప్రసాద్ 3000 మీటర్ల పరుగు పందెంలో, కె.సాత్వికత్రి యథ్లాన్ లో గెలుపొందారని తెలిపారు.వారందరికీ ప్రబంధకారిణి సభ్యులు,ఆచార్యులు విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో లవకుమార్,విద్యాధికారి రమణ,ఈఓ అన్వర్ అలీ,పిఈటి శ్రీనివాస్ రెడ్డి,గ్రామ సర్పంచ్ షబానా బేగం ఇజాజోద్దీన్,ఉప సర్పంచ్ లావణ్య సాయి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కాల్వ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : మండలంలోని కాల్వ గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చిట్యాల్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఆర్థిక అక్షర శత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ పాండు,గ్రామ సర్పంచ్ బ్యాగరి రోజా నవీన్ పాల్గొన్నారు.గ్రామంలోని ప్రజలు చదువుకోవాలని చదువు వల్ల ప్రజలకు ప్రయోజనాలు కలుగుతాయని అలాగే గ్రామంలోని 10 సంవత్సరాలలోపు బాలికలకు సుకన్య సమృద్ధి పథకంలో డబ్బులు జమ చేయాలని 350 రూపాయలతో కథ తెరిచి సంవత్సరానికి 2500 నుండి లక్ష యాభై వేల వరకు జమ చేసుకోవచ్చని 15 సంవత్సరాల తర్వాత,21 సంవత్సరం వయసు వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో కలిపి ఈ యొక్క మొత్తం ని తీసుకోవచ్చని తెలిపారు.అలాగే గ్రామంలోని ఖాతాదారులు ప్రమాద బీమా చేయించుకోవాలని అనుకొని పరిస్థితులలో ప్రమాదం జరుగుతే ఖాతాదారునికి బీమా డబ్బులు చెల్లించడం జరుగుతుందని దీని ద్వారా కుటుంబ సభ్యులకు కొంచెం అధికంగా ఉండదానికి వీలుగా ఉంటుందని ప్రతి ఒక్కరూ భీమ చేయించుకోవాలని తెలిపారు.ఎస్.బి.ఐ అందించే సేవల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బ్రదర్ సుధాకర్ ఎఫ్ఓ అగ్రి హరీష్,సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కమ్మర్‌పల్లిలో బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలో శ్రీగిరి క్షేత్రంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమ్మల కళ్యాణ మహోత్సవ జాతర వేడుకలను నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బోగ రామస్వామిశుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామివారిని శ్రీగిరి క్షేత్ర ఆలయానికి తీసుకవచ్చామని మూడు రోజుల నుండి ప్రత్యేక పూజలు, యజ్ఞ హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. జాతర వేడుకలు, మూడు రోజులు ఘనంగా నిర్వహిస్తున్నామని, రథయాత్ర ఊరేగింపుగా జరుగుతుందని తెలిపారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## చెట్టుకు ప్రాణం పోసిన హన్మాండ్లు

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలో గత నాలుగు సంవత్సరాల క్రితం జాతీయ రహదారి వెడల్పులో తొలగించిన చెట్లను హరితహారంలో భాగంగా కమ్మర్‌పల్లికి చెందిన పేర్ని శివతాండవం కళాకారుడైన ముద్రవేణి హన్మాండ్లు అతని స్నేహితుడు గుగ్గిలం దేవరాజు సహకారంతో కలిసి శ్రీగిరి గుట్ట వద్దకు క్రేన్ల సాయంతో చెట్టును తీసుకవచ్చి కన్యక వాసవి పరమేశ్వరి ఆలయం వద్ద ఈ చెట్టును నాటారు. ఈ రోజుకు 5 సంవత్సరంలోకి అడుగు పెడుతున్నందున కేక్ కట్ చేసి ఘనంగా సంబురాలు జరిపామన్నారు. ముఖ్యఅతిథిగా ఎఫ్ఆర్ఐ రవీందర్ హాజరై మాట్లాడారు. ట్రాన్స్ ప్లాంటింగ్‌చేస్తే 100 సంవత్సరాల చెట్లను కూడా బతికించవచ్చన్నారు. కార్యక్రమంలో డివైఆర్ఓ శ్రీనివాస్, ఎఫ్‌బిఓ ఎర్రం వరుణ్, సర్పంచ్ కొత్తపల్లి హరిక, ఉప సర్పంచ్ కొత్తపల్లి అశోక్, గ్రామ కమిటీ అధ్యక్షులు గోబ రామస్వామి, బిచ్చి మల్లయ్య, రచయిత్రి మగ్గిడి లక్ష్మీ, ముద్రవేని హన్మాండ్లు, వార్డు సభ్యులు లోలం సురేష్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు

ప్రజాపక్షం/నిజామాబాద్ : మండల కేంద్రంలో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ వద్ద గాంధీజీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు. ఆయన అహింసా మార్గంలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి, ఎఎంసి చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు అజ్మత్ పాషా, వేముల జగదీష్, సంపంగి నాగరాజు, దూలూర్ కిషన్‌గౌడ్, ముత్యాల చంద్రకాంత్‌రెడ్డి, నల్లసాయి పాల్గొన్నారు.

## ఐకెపి గ్రామ సంఘాల భవనాలకు శంకుస్థాపన

ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండలంలోని ఐకెపి గ్రామ సంఘాలకు భూమిపూజ చేశారు. మండలంలోని బాబానగర్ కాలనీ, బాబాపూర్, పల్లికొండ, పిప్రి గ్రామాల్లో నూతనంగా మహిళా భవనాల నిర్మాణం కోసం ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఏఈ విక్రమ్, ఎపిఓ నర్సయ్య స్థానిక సర్పంచ్‌ల చేతుల మీదుగా శుక్రవారం భూమిపూజ చేశారు. పిప్రి, బాబానగర్, బాబాపూర్, పల్లికొండ సర్పంచ్‌లు అరిగెల జనార్ధన్, శ్రీరామ సుమలత అరవింద్, మనీష అశోక్ భూమిపూజ చేశారు.

## అంగరంగ వైభవంగా గజ్జలమ్మ కల్యాణం

ప్రజాపక్షం/కుంటాల : కుంటాల మండల ప్రజల ఇలవేల్పు గజ్జలమ్మ ఆలయ ఆరవ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం గజ్జలమ్మ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.పండితులు వినాయపాండే,శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు నిత్య విధి,యజ్ఞ కార్యక్రమము గజ్జలమ్మ కళ్యాణము సాయంత్రం 3 గంటలకు రథోత్సవము,హారతి,మంత్రపుష్పము,తీర్థ ప్రసాద వితరణ,తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.కళ్యాణంలో పలువురు దంపతులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.గజ్జలమ్మ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ ప్రాంగణ మంతా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది.ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో గజ్జలమ్మ విగ్రహాన్ని ప్రధాన వీధుల గుండా భాజబజంత్రిలతో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## కరెంటు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/నేరడిగొండ : రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 24 గంటల కరెంటు సప్లై ఉన్నందున ఇండ్లలో హౌస్ వైరింగ్,లేదా మీటర్ల వద్ద ఆన్ ఆఫ్ స్విచ్లలని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి షార్ట్ సర్క్యూట్ ఏర్పడకుండా ఆస్తులను కాపాడుకోవాలని హ్యూమెన్ రైట్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ అమృత్ కుమార్,ఇటీవల మండలంలోని కుప్టి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ తో దగ్ధం అయినా ఇంటిని పరిశీలించి వారిని పరామర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రమాదాలమూలంగా ప్రాణ ఆస్తి నష్టాలు సంభవించవచ్చు కాబట్టి ఎప్పటికప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## సిఎం కప్‌లో వాలీబాల్ టోర్నీ విజేతగా నిలిచిన కారేగాం గ్రామస్తులు

ప్రజాపక్షం/ముధోల్ : మండల కేంద్రమైన ముధోల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఎం కప్ టోర్నీ లో భాగంగా వివిధ క్రీడా పోటీలు జరిగాయి.జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన క్రీడాకారులు ఇట్టి పోటీల్లో పాల్గొని తమ ప్రదర్శనను కనబరిచారు.మండలంలోని కారేగాం గ్రామానికి చెందిన విద్యార్థులు సీఎం కప్ టోర్నీ లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి మొదటి విజేతగా నిలిచారు.మొదటి విజేతగా నిలిచిన విద్యార్థులకు టోఫీతో పాటు మెడల్స్ బహుకరించారు.రానున్న రోజుల్లో సైతం మరెన్నో ఉత్తమ ప్రదర్శనలు కనబరిచి ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు.విజేతగా నిలిచిన జట్టులో క్రీడాకారులు మహేందర్,సంకీర్తన్,గణేష్,సాయి,అరవింద్,శివప్రసాద్ ఉన్నారు.

## పౌర హక్కుల దినోత్సవం

ప్రజాపక్షం/మామడ : పౌర హక్కుల దినోత్సవంను మామడ మండలంలో నిర్వహించడం జరిగింది.సామాజిక సామరస్యం,హక్కుల పరిరక్షణే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది అనిన హక్కులపై అవగాహన కల్పించారు.ప్రతి నెల చివరి వారంలో రెవిన్యూ అధికారులు,పోలీస్ అధికారుల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.పౌరుల యొక్క హక్కులు,స్త్రీల పరిరక్షణ మత వివక్ష నిర్మూలన గురించి ప్రజలకు తెలుపుతూ చైతన్య వంతం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల గర్దివర్ మెహరాజ్,జీవివో నువ్వుల రాజేందర్,పంచాయతీ కార్యదర్శి మంగేష్,ఉప సర్పంచ్ ప్రవీణ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు తప్పనిసరి

ప్రజాపక్షం/ఖానాపూర్ : జంతు సంక్షేమ వారోత్సవాల సందర్భంగా ఖానాపూర్ మండల వెటర్నరీ కార్యాలయంలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు.ఈ సందర్భంగా వెటర్నరీ ఏడీ రామచంద్రుడు మాట్లాడుతూ పెంపుడు జంతువుల యజమానులు అప్రమత్తంగా ఉండి తమ ఇళ్లలో పెంచుకునే పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని తెలియజేశారు. ప్రాణాంతక రేబిస్ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని తద్వారా జంతువులను,వాటి నుండి ఎలాంటి ప్రమాదం జరగకుండా మనుషులను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరు జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జంతువులకు ఎలాంటి చిన్న వ్యాధి సోకినట్లు అనిపించిన వెటర్నరీ హాస్పిటల్ కి తీసుకొచ్చి టీకాలు వేయించాలని సూచించారు.వెటర్నరీ వైద్య సిబ్బంది పెంపుడు జంతువుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

